మినీకథ

# నిక్ నేమ్

ఎ.వి.వి.యస్.యస్.ప్రసాద్.



ఆరోజు మామూలుగా కాలేజికి బయలు దేరాను. దారిలో గోపి, శేషు, రవి, రాము కలిశారు. నేనూ వాళ్ళూ కలిసి ఏవో కబుర్లు చెప్పుకుంటూ నడక సాగించాము. మాలో ప్రత్యేకంగా ఎవరి గురించి చెప్పుకోవడాన్కి ఏమీ లేదు - ఒక్క గోపి గురించి తప్ప!

వాడికున్న లక్షణాలలో ఒకటి, మెడకాయ మీద తలకాయ వున్న ప్రతివాడికి 'నిక్‌నేమ్' పెట్టడం!

మా తెలుగు లెక్చరర్ పంచె, లాల్చీ వేసుకుంటే ఆయన్ని "ఒరేయ్ గోపిగాడొస్తున్నాడు" అని, మా ఇంగ్లీషు లెక్చరర్ పొట్టిగా వుంటే ఆయన్ని "గిడ్డు" "టిల్లు" అని, మాకామర్స్ మేడమ్ మూర్తి కాస్త ఎత్తుగా వుంటే, "వరహావతారం" అని, మా ఎకనామిక్స్ లెక్చరర్ని "జుంపాలాడు వస్తున్నాడని" అనేవాడు.

ఇలా ప్రతీ లెక్చరర్‌కి నిక్‌నేమ్ పెడ్తూ, ఒకసారి ప్రిన్స్‌పాల్ దగ్గరకి వెళ్ళాడు. మా ప్రిన్స్‌పాల్ ఆడావిడ, బహుశా బాగా తిట్టింది కాబోలు, బైటకి వచ్చి ఆవిడ్ని నానా బండ బూతులు తిట్టి, ఆవిడ 'కనకం' అనే పేరుని 'శునకం'గా మార్చాడు.

వాడి మాటలు వింటూ వుంటే మాకు సరదాగా వుండేది. కాలేజికి చేరాం.

ఆరోజు మా ఎకనామిక్స్ లెక్చరర్ రాలేదు.

"ఒరేయ్ జుంపాలాడు రాలేదంటే ఇవాళ వర్షం" అన్నాడు గోపి.

పది రోజులు గడిచాయి.

ఆరోజు వచ్చారు మా ఎకనామిక్స్ లెక్చరర్.

ఆయన గుండు చేయించుకున్నారు. అది గోపి కాలేజికి వచ్చిన వెంటనే చూశాట్ట.

ఆయనకి ప్రస్తుతం వున్న 'నిక్‌నేమ్' చాలక- గుండు పెడ్తామా? గుండ్రాయి పెడ్తామా? వగైరా గుండుకి, దాని ఆకారానికి సంబంధించిన పేర్లన్ని సేకరించి చివరికి ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఎకనామిక్స్ పిరియడ్-

లెక్చరర్ వచ్చి కూర్చుంటూ-

"సారీ ఫర్ ది ఆబ్సెంట్" అన్నారు.

ఇంతలో-

వెనక బెంచిలో కూర్చున్న గోపి మరో ఇద్దరు కలిసి- "బల్బు" అని ఆయన గుండు చూసి ఎక్కిరించడం మొదలు పెట్టారు.

గోపి "బల్బు" అనగానే-

మిగిలిన వారు-

"లా లా లా..."

"పుయ్...పుయ్..." వాళ్ళ నోళ్ళకి వచ్చిన మ్యూజిక్ ఎఫెక్ట్స్ యిస్తున్నారు.

వాళ్ళు తనని హేళన చేస్తున్నారని ఆయనకి అర్థమయింది. మెల్లగా-

"మా నాన్నగారు పోయారు..."

తరువాత మాటలు వినిపించలేదు.

వెనక నుండి అరుపులు ఆగిపోయాయి.

వాళ్ళ నోళ్ళు మూగబోయాయి.

నా కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి!

*